# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు





పశ్చిమ బెంగాల్‌లో తాజాగా 8 లక్షల ఓట్ల తొలగింపు
66 లక్షలకు చేరిన ఓట్ల తొలగింపు


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 229 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 01 - 03 - 2026


## విజన్ 2047 లక్ష్యంతో
# ప్రభుత్వం ముందుకు

- తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదు రాష్ట్ర, దేశ నిర్మాణం
- మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్న మంత్రి
- రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వెల్లడి
- విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్న మంత్రి



హైదరాబాద్ :
నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదని, అది రాష్ట్ర, దేశ నిర్మాణమని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ అండ్ జనరల్ కౌన్సిల్ మీటింగ్-2025-26 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన - మిగతా 2 లో


2 లో

## మక్కా బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

- గత ఏడాది నవంబర్‌లో మృతి చెందిన 44 మంది
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేత
- గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున అందజేత

## రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం
# మీద విశ్వాసం ఉంది



- రాజ్యసభ సీటుపై వి హనుమంతరావు
- తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలు
- తన పనితీరు చూసి రేవంత్ రెడ్డి తప్పకుండా అవకాశం ఇవ్వాలన్న వీహెచ్
- పార్టీలో పనిచేసే వారికి పదవులు దక్కుతాయని రేవంత్ రెడ్డి అన్నారన్న వీహెచ్
- మొదటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్నానని వెల్లడి

హైదరాబాద్ :
తనకు రాజ్యసభ అవకాశం కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ అధిష్ఠానం మీద పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి హనుమంతరావు అన్నారు. తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండగా, వాటి - మిగతా 2 లో

# సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం

- దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ
- 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం దేశవ్యాప్త హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం
- రాజస్థాన్‌లో పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపన
- 21,800 మందికి పైగా కొత్త ఉద్యోగులకు నియామక పత్రాల పంపిణీ



ఢిల్లీ :
సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. మహిళల్లో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం రూపొందించిన హెచ్‌పీవీ (హ్యూమ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని సమక్షంలో పలువురు పాఠశాల విద్యార్థినులకు టీకాలు వేశారు. అనంతరం మోదీ వారితో ముచ్చటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. నివారణ ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొంది.రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కిషన్‌గఢ్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, గవర్నర్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జైపూర్-బండికుయ్ ఎక్స్‌ప్రెస్‌వే, అమృత్‌సర్-జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లోని ఓ భాగాన్ని ఆయన - మిగతా 2 లో

## ఇరాన్ పై ఇజ్రాయెల్
# మెరుపు దాడులు



- భారతీయులకు ఎంబసీ అడ్వైజరీ
- అప్రమత్తంగా ఉండాలని టెల్ అవీవ్ రాయబారి సూచన
- షెల్టర్లకు సమీపంలోనే ఉండాలని హెచ్చరికలు
- టెహ్రాన్ లోని ఖమేనీ ఆఫీసుకు సమీపంలో క్షిపణి దాడి
- సుప్రీం లీడర్ క్షేమంగానే ఉన్నారన్న అధికారులు

ఢిల్లీ :
ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడులతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసింది. భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, భారత పౌరులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక అధికారులతో టచ్‌లో - మిగతా 2 లో




## బాణసంచా పేలుడు ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా కేంద్రం పేలుడు
- ఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు
- 21 మంది మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన చంద్రబాబు
- ప్రమాద బాధితులకు ప్రధాని మోదీ పరిహారం ప్రకటన



అమరావతి :
కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ - మిగతా 2 లో

## కాకినాడ జిల్లా బాణాసంచా
## పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి



- వేట్లపాలెం బాణాసంచా పేలుడు ఘటనపై జగన్ స్పందన
- ప్రమాదంలో పలువురు మృతి చెందడంపై ఆవేదన
- మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వానికి సూచన
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్

అమరావతి :
కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటనపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన విచారాన్ని తెలియజేశారు.ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అలాగే, ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. పేలుడు ధాటికి గాయపడిన వారికి వెంటనే మెరుగైన వైద్య సహాయం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

- 21కి చేరిన మృతుల సంఖ్య
- కాకినాడ జిల్లా సూర్యశ్రీ ఫైర్‌వర్క్స్ కేంద్రంలో భారీ పేలుడు
- బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు
- పేలుడు ధాటికి పంటపొలాల్లోకి ఎగిరిపడిన మృతదేహాలు
- బాణసంచా పరిశ్రమలో ఇంకా కొనసాగుతున్న పేలుళ్లు
- ఘటనా స్థలంలోనే 18 మంది దుర్మరణం
- మరో 9 మంది పరిస్థితి విషమం
- ఐదు కిలోమీటర్ల మేర వినిపించిన భారీ శబ్దం
- తీవ్రతకు పక్కగ్రామంలోని స్కూల్ స్లాబ్ కు పగుళ్లు



అమరావతి :
కాకినాడ జిల్లా బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడుకు 21 మంది ఆహుతయ్యారు. మండలంలోని వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది.వేట్లపాలెం, జి.మేడపాడు మధ్య పంట పొలాల్లో బాణసంచా తయారు చేస్తున్నారు. అడపా నాని అనే వ్యక్తి పొలాల్లో చదును చేసి బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. వరిపొలాల మధ్య ఎవరూ రాలేని ప్రాంతంలో ఈ బాణసంచా కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ రోజూ 25 నుంచి 30 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువగా మహిళలే ఉన్నారు. ఇవాళ కూడా అధిక సంఖ్యలో మహిళలు బాణసంచా తయారీలో - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'మేధా' శిఖరాలపై భారత్

ఐటీ రంగంలో భారతీయ ప్రతిభ సాధిస్తోన్న పురోగతి అద్భుతమైనది. భారత్‌కు ఉన్న 'విశ్వగురు' అన్న ప్రఖ్యాతిని అది సార్థకం చేస్తోంది. ఆ సాంకేతికత అధునాతన వికాసంలో యువ భారతీయుల విజయాల ఆలంబనతో దేశ ప్రతిష్ఠను మరింతగా ఇనుమడింపచేసేందుకు భారతీయ దౌత్యవేత్తలు అపూర్వ కృషి చేస్తున్నారు. నవ నవీన సాంకేతికత కృత్రిమ మేధ (ఏఐ) బహుముఖీన ప్రభావంపై ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన అయిదు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆ కృషిలో భాగమే. అమెరికా, యూరోపియన్ దేశాలను ఎంతగా ఆకర్షించిందో, అరబ్ దేశాలను, లాటిన్ అమెరికాను, ఆఫ్రికా దేశాలనూ అంతగా ఆకర్షించిన విశిష్ట సదస్సు అది. కొన్ని కారణాలతో మనతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కెనడాతో పాటు, ఐటీ, ఏఐలలో చాలా ముందంజలో ఉన్న దేశాలు కూడా భారత్ ఆహ్వానాన్ని మన్నించి న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భారత సామర్థ్యంపై ప్రపంచ దేశాలకు పరిపూర్ణ విశ్వాసం ఉన్నదనడానికి 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026' ఒక తిరుగులేని తార్కాణం. ఇటువంటి సదస్సులలో గల్ఫ్ దేశాల రాచకుటుంబీకులు పాల్గొనడం చాలా అరుదు. గల్ఫ్‌లో అత్యధిక డేటా సెంటర్లు నిర్వహిస్తూ, వాటి సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించడానికి ప్రయత్నిస్తోన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పక్షాన అబుదాబి యువరాజు షేక్ ఖాలీద్ ఈ న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నారు. సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ యూఏఈ యువరాజుకు స్వాగతం పలుకగా, ప్రధాని మోదీ ఆయన గౌరవార్థం విందు ఇచ్చారు. సౌదీ అరేబియా ఉన్నతాధికార వర్గాలు కూడా ఈ సదస్సులో పాల్గొన్నాయి. ఈ ఏఐ సదస్సును విజయవంతం చేసేందుకు భారత విదేశాంగ శాఖ అధికారులు రేయింబవళ్ళు కష్టపడ్డారు. కొన్ని విషయాలకు సంబంధించి, ఆహ్వానితులు అడిగిన సమాచారం ఇవ్వడానికి నిజాయితీగా శ్రమించారు. ఆ సందర్భంలో తెలుగు రాష్ట్రాల అధికార వర్గాలను కూడా భారత దౌత్యవేత్తలు సంప్రదించిన విషయం కొందరికి మాత్రమే తెలుసు. అగ్ర రాజ్యాలు, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకులతో పాటు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ మొదలైన టెక్ దిగ్గజాలు పాల్గొన్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌తో భారత్ యశోచంద్రికలు మరింతగా విరాజిల్లాయి.బ్రిటన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్‌లు మాత్రమే ఇప్పటివరకు అంతర్జాతీయ ఏఐ సదస్సులు నిర్వహించాయి. ఆ మూడు దేశాల్లో సదస్సుల కంటే న్యూఢిల్లీ సదస్సే బాగా విజయవంతమయింది. రానున్న కాలంలో కృత్రిమ మేధస్సు రంగానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ఈ సదస్సు జరిగిందనడంలో అతిశయోక్తి లేదు. పారిస్ సదస్సులో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అమెరికా, బ్రిటన్‌లు పారిస్ డిక్లరేషన్‌లో భాగస్వాములు అయ్యేందుకు నిరాకరించాయి. అయితే న్యూఢిల్లీ డిక్లరేషన్‌పై ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆ రెండు దేశాలు సైతం సంతకం చేశాయి. సదస్సులో భాగంగా జరిగిన 500 గోష్ఠులలో అమెరికా, ఫ్రాన్స్, చైనా, బ్రిటన్ సహా 88 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కీలక భూమిక వహించనున్న కృత్రిమ మేధస్సు రంగం కేవలం కొందరి చేతులలో కేంద్రీకృతం కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని, తప్పుడు సమాచార వ్యాప్తి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని న్యూఢిల్లీ డిక్లరేషన్ కోరింది. ఈ నవీన సాంకేతికతను ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధికి ఒక చోదక శక్తిగా మార్చాలని భారత్ పిలుపునిచ్చింది. తద్వారా భారత్ తన నాయకత్వపు దార్శనికతను స్ఫూర్తిదాయకంగా వెల్లడించింది. బహు భాషలు విలసిల్లుతోన్న భారత్‌లో ప్రతి భారతీయుడూ ఏఐని తన మాతృభాషలో వినియోగించుకునేందుకు వీలుగా 'సర్వం' పేర ఆవిష్కృతమైన భారతీయ భాషల విధానం (ఎల్.ఎల్.ఎం, ఎస్.ఎల్.ఎం) ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలిచింది.'కృత్రిమ మేధస్సు రూపకల్పన, అభివృద్ధి భారత్‌లో జరిగినా వాటి ఫలాలు, ప్రయోజనాలు సమస్త దేశాలకు చెందుతాయని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆయన గంభీరవాణి ఇంట కంటే బయటే ఎక్కువగా ప్రతిధ్వనించింది. కనుకనే దేశంలోకి భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి అనేది ఇక్కడ గమనార్హం. కృత్రిమ మేధస్సు పనితీరు, దాని విధి విధానాలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బాలారిష్టాల దశలో ఉన్నాయి. ఇందుకు భారత్ మినహాయింపు కాదు. కృత్రిమ మేధస్సు, డేటా సెంటర్లకు అవసరమైన నీటి లభ్యత, స్థల సేకరణ, ఇతర మౌలిక ఆవశ్యకతలపై ఆశాజనక చర్చ జరగలేదు. అదే విధంగా ఏఐతో కొత్త ఉద్యోగాల సృష్టి, ఉన్న ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే అవకాశాలను కూడా సదస్సు విస్మరించింది.కృత్రిమ మేధస్సును ప్రోత్సహించడంలో భాగంగా పలు ప్రైవేటు సంస్థలు కూడా న్యూఢిల్లీ సదస్సులో పాల్గొన్నాయి. వాటిలో ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం కూడా ఉన్నది. చైనాలో రూపొందిన ఒక మర కుక్కను తమ స్వంత ఆవిష్కరణగా ఆ ప్రైవేట్ విశ్వవిద్యాలయం ప్రకటించుకుని అభాసుపాలైంది. సదరు ప్రైవేటు విశ్వవిద్యాలయ మహిళా ప్రతినిధి తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు చేసిన వాదనలతో అసలు వంచన రచ్చకెక్కింది. ఇది ముమ్మాటికీ దగా అనడంలో సందేహమేమీ లేదు. విషయం తెలిసిన వెంటనే అధికారులు ఆ మరకుక్కను ప్రాంగణం నుంచి తొలగించి తమ బాధ్యతను నిర్వర్తించారు, అయితే అప్పటికే దానిపై ఎంతో రభస జరిగిపోయింది. ప్రాంగణం వద్ద కాంగ్రెస్ కార్యకర్తల అర్ధనగ్న ప్రదర్శన భారత్ పేరు ప్రతిష్ఠలకు మచ్చగా మిగిలిపోయింది. ఏదేమైనా, అంతర్జాతీయంగా భారత్ కీర్తిని ఇనుమడింపజేసిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026'ను దేశీయంగా రచ్చకీడ్చడం జాతి ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందుతున్న విదేశాంగ విధానానికి విఘాతం కలిగించడమే.

# బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

**మొదటిపేజీ తరువాయి** – పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం తర్వాత బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించింది. దాదాపు గంటకుపైగా పేలుళ్లు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు.

కాకినాడ జిల్లాలో భారీ పేలుడు – 21కి చేరిన మృతుల సంఖ్య

పేలుళ్లు సంభవించినప్పుడు భూకంపం వచ్చినంతగా శబ్ధం విన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల గ్రామాలు భయాందోళనకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగ అలుముకుంది. స్థానికులు పేలుడు సంభవించిన ప్రాంతానికి చేరుకునే సరికి చాలామంది అగ్నికి ఆహుతయ్యారు. శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి.

**ఘటనా స్థలం వద్ద బీతావహంగా పరిస్థితి :** పేలుళ్ల ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పొలాల మధ్య బాణసంచా తయారీ కేంద్రం ఉండటంతో అక్కడికి ఫైర్ ఇంజిన్, అంబులెన్స్ వెళ్లే మార్గం కూడా లేదు. వరిపొలాలు బురదమయంగా ఉండటం వల్ల వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఫలితంగా చాలా సేపటి వరకు పేలుళ్లు కొనసాగాయి. ఘటనా స్థలం వద్ద పరిస్థితి బీతావహంగా ఉంది. మంటల్లో కాలిపోయి తీవ్రంగా గాయపడ్డ బాధితులను అతికష్టం మీద స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పేలుడుతో జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు వ్యక్తులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేట్లపాలెం వాసి కప్పా వెంకటలక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె.శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు.

**మృతులు వీళ్లే :** మృతుల్లో ఇప్పటి వరకు 11 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మృతులు అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నాని ఉన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.గతంలోనూ ఇదే గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. అప్పుడు కూడా కొందరు చనిపోయారు. గతేడాది అక్టోబరు 8న మండపేట మండలం రాయవరంలోనూ పేలుడు సంభవించింది. అక్కడికక్కడే ఆరుగురు చనిపోయారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరికొందరు చనిపోయారు. ఎన్ని ఘటనలు జరుగుతున్నా జాగ్రత్తలు పాటించడం లేదు. కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నిపుణులైన కార్మికులను నియమించుకోవడం లేదు. ఇదే సమయంలో సరైన పర్యవేక్షణ కూడా లేకపోవడం వల్ల వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి :**

కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ట్వీట్ చేశారు.తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు. ఘటనాస్థలానికి వెళ్లాలని హోంమంత్రి అనితకు ఆదేశించారు. సీఎం సూచనలో హుటాహుటిన ఘటనాస్థలానికి హోంమంత్రి వంగలపూడి అనిత బయలుదేరారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు ఉన్నారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చంద్రబాబు తెలిపారు. బాధితులకుఅవసరమైన తక్షణ సాయం అందించాలని, ఘటనాస్థలంలో అధికారులు సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

**పలువురు దిగ్భ్రాంతి:** కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎంతో బాధ కలిగించిందని మంత్రుల అచ్చెన్నాయుడు, గొట్టిపాటి, నారాయణ, బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు మంత్రులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్య శాఖ సెక్రటరీ, ఐవీజు , ఐ.వీ.ఎ.నా.లను మంత్రి సత్య కుమార్ ఆదేశించారు.సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని ఘటనాస్థలికి వెంటనే పంపాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందాలు అప్రమత్తంగా పని చేయాలని మంత్రి సుభాష్ సూచించారు. మంటల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పేలుడుకు గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రులు స్పష్టం చేశారు.

**మరో 9 మంది పరిస్థితి విషమం :**

అయితే పరిశ్రమకు ఈ ఏడాది మార్చి 31 వరకు లైసెన్స్ ఉందని స్థానిక ఆర్డీవో తెలిపారు. ప్రస్తుతం బాణసంచా పరిశ్రమ యజమాని పరారీలో ఉన్నారని ఆర్డీవో వెల్లడించారు. అలాగే ఆస్పత్రుల్లో ఉన్న 9 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న మోర్తా శ్రీను, సత్యవేణి పరిస్థితి విషమంగా ఉంది. అలాగే కె.శ్రీను, చిటికెల లక్ష్మి, డి.రాజులోవరాజు కాకినాడలో చికిత్స పొందుతున్నారు. అడబాల వీరబాబు పరిశ్రమలో గతంలోనూ పేలుడు జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

# బాణసంచా పేలుడు ఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి** – ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడిన సీఎం బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నానని బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటనను అధికారులు తెలిపారు. విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై సీఎం ఆరా తీశారు. ఈ ప్రమాదం సూర్య ఫైర్ వర్క్స్‌లో జరిగిందని అధికారులు తెలిపారు. పెద్ద సంఖ్యలో బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. మంత్రులను, ఉన్నతాధికారులను ఘటనా స్థలానికి వెళ్లాలని సీఎం సూచించారు.

**తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఉపముఖ్యమంత్రి :** కాకినాడ జిల్లా వేట్లపాలెం గ్రామంలోని బాణాసంచా పరిశ్రమలో చోటు చేసుకున్న భారీ విస్ఫోటనంలో పలువురు మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, మంత్రి లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబాలకి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కలెక్టర్, ఎస్పీ ఘటన స్థలంలో ఉండి పరిస్థితిని, సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించే ఏర్పాట్లు చేశారన్నారు.బాణాసంచా తయారీ పరిశ్రమ నుంచి ఇంకా పేలుళ్లు వస్తున్నాయని అధికారులు తెలిపారు. బాణాసంచా పరిశ్రమలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచి భద్రత చర్యలను తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు పవన్ ఆదేశించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ లను ఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలు పర్యవేక్షణ చేపట్టి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాలని దిశానిర్దేశం చేయలని పవన్ సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు నియోజకవర్గం పెరవలి నుండి హుటాహుటిన కాకినాడ వేట్లపాలెం బయల్దేరి వెళ్లారు.

**మృతుల కుటుంబాలకు లోకేశ్ భరోసా :**

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం అన్నారు. మృతులకు నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు.కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో పేలుడు ఘటనలో కార్మికులు మృతి పట్ల హోం మంత్రి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి హుటాహుటిన వేట్లపాలెంలో పేలుడు ఘటన స్థలానికి హోం మంత్రి బయలుదేరారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి వివరాలను హోంమంత్రి ఆరా తీస్తున్నారు.

**ఘటనపై మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి :**

కాకినాడ జిల్లా వెట్లపాలెంలో బాణా సంచా పేలుడు ఘటనపై మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్, సత్యకుమార్, నారాయణలు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్య శాఖ సెక్రటరీ, డిఏంఈ, డిఏంహెచ్ఓ లకు సత్య కుమార్ ఆదేశించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని సంఘటన స్థలానికి వెంటనే పంపాలని తెలిపారు. అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు తక్షణ సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఇరాన్ పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు

**మొదటిపేజీ తరువాయి** – ఉన్నామని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది.

**ప్రధాన సూచనలు..**

ఇజ్రాయెల్ అధికారులు, 'హోమ్ ఫ్రంట్ కమాండ్' జారీ చేసే భద్రతా సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తప్పనిసరిగా పాటించాలి.నివాస ప్రాంతాల్లో లేదా కార్యాలయాల వద్ద ఉన్న రక్షణ కేంద్రాలు, సురక్షిత గదుల గురించి ముందే తెలుసుకోవాలి. అత్యవసర సమయంలో వెంటనే అక్కడికి చేరుకునేందుకు సిద్ధంగా ఉండాలి.ఇజ్రాయెల్ దేశం లోపల అత్యవసరం కాని ప్రయాణాలను ప్రస్తుతానికి పూర్తిగా వాయిదా వేసుకోవాలి. స్థానిక వార్తలు, అధికారిక ప్రకటనలు, అత్యవసర హెచ్చరికలను నిరంతరం గమనిస్తూ ఉండాలి.

**టెహ్రాన్ లో భీకర దాడులు..**

అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ సైన్యం టెహ్రాన్ లోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ కార్యాలయానికి సమీపంలోనే దాడులు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, ఆ సమయంలో ఖమేనీ టెహ్రాన్ లో లేరని, అధికారులు ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించారని అంతర్జాతీయ మీడియా సంస్థ రాయిటర్స్ పేర్కొంది.

## సర్వైకల్ క్యాన్సర్‌పై సమరం

**మొదటిపేజీ తరువాయి** – ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.వీటితో పాటు 'ప్రతి ఇంటికి నీరు' పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులకు, పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ, గ్రిడ్ సబ్-స్టేషన్లకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 'రోజ్‌గార్ ఉత్సవ్' కింద కొత్తగా ఎంపికైన 21,800 మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. మహిళల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రధాని రాజస్థాన్ పర్యటన సాగింది.

## మక్కా బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



**మొదటిపేజీ తరువాయి** – గత సంవత్సరం నవంబర్‌లో మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. ఈ బస్సు ప్రమాదంలో గాయపడినవారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించారు.గత సంవత్సరం నవంబర్ 17న మక్కా యాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళుతున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది.

# మార్గమధ్యంలోనే వెనుదిరిగిన ఎయిరిండియా విమానం



**మొదటిపేజీ తరువాయి** – ఇరాన్‌పై ఇజ్రాయెల్ 'ప్రివెంటివ్' దాడులు (ముందస్తు దాడులు) చేయడంతో మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. దీంతో శనివారం ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్ నగరమైన టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం మార్గం మధ్యంలోనే వెనక్కి తిరిగి వచ్చేసింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా విమానాన్ని తిరిగి ఢిల్లీకే రప్పించినట్లు అధికారులు తెలిపారు.ఇరాన్‌పై దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి అధికారికంగా ధృవీకరించారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని యూనివర్సిటీ స్ట్రీట్, జోమ్హూరీ జిల్లాల్లో క్షిపణి దాడులు జరిగినట్లు, అక్కడ భారీ పేలుళ్లు వినిపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కీలక ప్రభుత్వ భవనాలు ఉన్న పాశ్చర్ స్ట్రీట్ సమీపంలో దట్టమైన పొగలు అలుముకున్న దృశ్యాలు కనిపించాయి. అయితే ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు. మరోవైపు, తాము పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, ప్రయాణికుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది.యుద్ధ వాతావరణం కారణంగా ఆ ప్రాంతంలో గగనతలాన్ని పాక్షికంగా మూసివేయడంతో పలు అంతర్జాతీయ విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. కజకిస్థాన్ నుంచి దుబాయ్ వెళ్లాల్సిన విమానాన్ని బాకుకు మళ్లించగా, షార్జా-మాస్కో విమానాన్ని పాకిస్థాన్ గగనతలం మీదుగా దారి మళ్లించారు. చికాగో నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానం సిరియా మీదుగా ప్రయాణించింది.దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ వ్యాప్తంగా ఎయిర్ రైడ్ సైరన్లు మోగించారు. ముందు జాగ్రత్త చర్యగా దేశవ్యాప్తంగా పాఠశాలలను మూసివేశారు. ప్రజలను ఇళ్ల నుంచే పని చేయాలని (ఔశీతీని టతీశీఎ ష్ట్రశీఎవ), బహిరంగ ప్రదేశాల్లో గుమికూడవద్దని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆదేశించింది. జెనీవాలో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య చర్చలు జరుగుతున్న కీలక సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం.

# విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు



**మొదటిపేజీ తరువాయి** – అభివృద్ధి లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అభివృద్ధికి నిర్మాణ రంగం కీలకమని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిల్డర్లకు మంత్రి సూచించారు.ప్రభుత్వాలు ప్రణాళికలు వేస్తాయి, బడ్జెట్ కేటాయిస్తాయి, ప్రాజెక్టులను ప్రకటిస్తాయని కానీ ఆ ప్రణాళికలకు ప్రాణం పోసేది మాత్రం బిల్డర్లేనని అన్నారు. బిల్డర్లు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభం చేస్తాయని, వంతెనలు దూరాన్ని తగ్గిస్తాయని అన్నారు. బిల్డర్లు కట్టే భవనాలు సేవలకు నిలయాలు అవుతాయని అన్నారు. అందుకే నిర్మాణ రంగం అంటే తన వరకు కేవలం కాంట్రాక్టు కాదని, దేశ, రాష్ట్ర నిర్మాణమని వ్యాఖ్యానించారు.అభివృద్ధికి పునాది మౌలిక వసతులేనని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్లు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయని, కనెక్టివిటీ బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టూ ట్రాఫిక్ భారాన్ని తగ్గించడమే కాదని, చుట్టుపక్కల జిల్లాల్లో అభివృద్ధికి మార్గాలు వేస్తుందని అన్నారు. ఇది ఆర్థిక కారిడార్లకు దారి తీస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

# రేవంత్ రెడ్డి, పార్టీ అధిష్ఠానం మీద విశ్వాసం ఉంది



**మొదటిపేజీ తరువాయి** – కోసం పలువురు రేసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో వీహెచ్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీలో తన పనితీరును చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీలో పని చేసిన వారికే పదవులు దక్కుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వికారాబాద్‌లో జరిగిన డీసీసీ శిక్షణ తరగతుల్లో చెప్పారని గుర్తుచేశారు. ఈరోజు వరకు పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నానని, అందుకే రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కోరుతున్నానని అన్నారు.పార్టీ కోసం తన పోరాట సామర్థ్యాలను చూసి అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అందరికంటే ఎక్కువగా తనమీద కేసులు నమోదయ్యాయని అన్నారు. అయినప్పటికీ తాను భయపడటం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఒక సిపాయిగా, గాంధీ కుటుంబానికి విధేయుడిగా పనిచేస్తున్నానని అన్నారు.తనకు రాజ్యసభ అవకాశంపై పలువురు కార్యకర్తలు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. తనకు ఫోన్లు చేసే వారికి ఒక విషయం చెప్పదలుచు కున్నానని, మన పని మనం చేసుకుంటూ వెళదామని అన్నారు. మిగిలినది అధిష్ఠానానికి వదిలివేద్దామని వ్యాఖ్యానించారు. జీవితంలో ఎవరికీ అన్యాయం చేయని తనకు న్యాయం జరుగుతుందని అన్నారు. తనకు రెండుసార్లు అన్యాయం జరిగినా పార్టీ జెండా మోస్తూనే ఉన్నానని తెలిపారు.తనకు అవకాశం ఇవ్వాలని మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు తెలిపారు. అవకాశం ఇవ్వాలని సోనియా గాంధీకి కూడా లేఖ రాసినట్లు తెలిపారు. గడిచిన పదేళ్లలో తనకు ఎలాంటి పదవి లేదని అన్నారు. ఈసారి ఈ బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు జాతీయ రాజకీయాల్లో చాలా పరిచయాలు ఉన్నాయని తెలిపారు. తాను ఢిల్లీలో ఉంటే మిగతా పార్టీలు, రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు.

# జాతీయ విజ్ఞాన దినోత్సవం



**గొల్లపల్లి ఫిబ్రవరి 28 ప్రజా మంటలు :** కొడిమ్యాల పట్టణంలోని స్థానిక విన్నర్స్ ఇంగ్లీష్ స్కూల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ మోడల్స్, ప్రయోగాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఉత్పత్తి, అంతరిక్ష పరిశోధన వంటి అంశాలపై విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసిన నమూనాలు విశేషంగా ప్రశంసలు అందుకున్నాయి.విజ్ఞానానికి సంబంధించిన తమ ప్రతిభను విద్యార్థులు సమర్థంగా ప్రదర్శించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద్ మాట్లాడుతూ, విజ్ఞానం మన దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులు శాస్త్రవేత్తల మాదిరిగా ఆలోచిస్తూ, పరిశోధనాత్మక దృక్పథంతో కొత్త ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు.జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఫిబ్రవరి 28న భారత శాస్త్రవేత్త సి.వి. రామన్ కనుగొన్న 'రామన్ ప్రభావం' స్మారకార్థంగా దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.కార్యక్రమం చివరగా శాస్త్రవిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయులు అన్నారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

## రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన



**జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు)** :రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్ లో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఆటో, బస్సు, లారీ మరియు ఇతర వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజులో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది చనిపోవడం జరుగుతుందని ఈ రోడ్డు ప్రమాదాలు, వాటి వల్ల జరిగే ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని ప్రారంబించడం జరిగిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని ప్రజల్లో అలవాటు చేయడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు..డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు.అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించడం జరిగింది. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పి రఘు చందర్, సీ.ఐ లు కరుణాకర్, రవీందర్,ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేశం డాక్టర్ లు మృదుల రెడ్డి, సుదీప్ , పోలీస్ సిబ్బంది, మరియు డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కు

## సీతారామ కళ్యాణ ఆహ్వాన పత్రిక అందజేత



**జగిత్యాల ఫిబ్రవరి 28 ( ప్రజా మంటలు)** :పట్టణ ధరూర్ క్యాంప్ కోదండ రామాలయం ,విద్యానగర్ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని వారి నివాసం లో కలిసి సీతా రామ కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు సమీండ్ల శ్రీనివాస్ ,గోలి శ్రీనివాస్,కౌన్సిలర్ లు బోయినపల్లి ప్రశాంత్ రావు,కోరుకంటి రాము,నాయకులు ఆరుముల్ల పవన్,హరీష్,స్వామి, జలంధర్ రావు,అశోక్ రావు,తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో పాల్గొన్న

## తొలి జెడ్పి చైర్ పర్సన్ వసంత



**జగిత్యాల రూరల్ ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు)** :మండలం తక్కలపల్లి గ్రామంలోని గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మరియు ఎల్లమ్మ బోనాలు,పట్నాల మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్ రావు గౌడ సంఘ అధ్యక్షులు నాగేష్ గౌడ్ మాజీ సర్పంచ్ లు తిరుపతి మహేష్ ప్రవీణ్ నాయకులు బత్తిని లింగయ్య నారాయణ రెడ్డి శంకర్ రజిని జైపాల్ శ్రీపాల్ మోహన్ మహేష్ గౌడ సంఘ సభ్యులు మహిళలు భక్తుల తదితరులు ఉన్నారు.

# ఆక్స్ఫర్డ్ పాఠశాలలో సైన్స్ డే వేడుకలు



**చిగురుమామిడి ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం రోజున జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు అనేక రకాల సైన్స్ ప్రాజెక్ట్స్ తయారు చేసి వాటి యొక్క ప్రాముఖ్యతను పనితీరును వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అప్పాల సమ్మయ్య మాట్లాడుతూ భారతీయ ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ 28 ఫిబ్రవరి 1928 రోజు రామన్ ఎఫెక్ట్ కనిపెట్టి మన భారతదేశం యొక్క కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తం చేశాడు దానికి గుర్తింపుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ రోజున జాతీయ సైన్స్ దినోత్సవశీ జరుపుకోవడం జరుగుతుంది. పిల్లలందరూ బాగా చదువుకొని భవిష్యత్తులో గొప్ప సైంటిస్టులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కూన సంపత్ మరియు ఉపాధ్యాయులు మంజుల. రమ్య. సమత. సంధ్య. శైలజ. సుస్మిత. రాధిక. జరీనా బేగం. షాజహాన. చాందిని మాలిక్. సంగీత కుజూర్. ఎలిజబెత్ లక్రా జ్యోతి ప్రవకులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ మామిడాలా లింగన్న



**గొల్లపల్లి ఫిబ్రవరి 28ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల కేంద్రలోని సూపర్ మార్కెట్ కు సరుకులు తీసుకెళ్తుండ గా మార్గమధ్యంలో పడిపోయిన ఆయిల్ కాటన్‌ను గుర్తించి యజమానికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు చందోలి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మామిడాల లింగన్న వివరాల్లోకి వెళ్తే, జగిత్యాల నుండి గొల్లపల్లి కి సూపర్ మార్కెట్ కు చెందిన సరుకులు ధర్మారం కు చెందిన ఆటోలో తీసుకువస్తుండగా మార్గమధ్యంలో ఆయిల్ కాటన్ పడిపోగా అదే సమయంలో గొల్లపల్లి వైపు వస్తున్న చందోలి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మామిడాల లింగన్న ఆ సరుకును గమనించారు.అనంతరం ఆ వస్తువు వివరాలు తెలుసుకొని గొల్లపల్లి సూపర్ మార్కెట్‌కు చెందినదని గుర్తించి సంబంధిత యజమానికి అందజేశారు. ఈ సందర్భంగా షాపు యజమాని ఆటో డ్రైవర్ లింగన్న నిజాయితీకి అభినందనలు తెలిపారు.

# విజయవంతంగా పూర్తి అయిన వార్డు మెంబర్ల మొదటి విడత

## శిక్షణా తరగతులు....



**చిగురుమామిడి ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు):** మండల కేంద్రంలోని 9 గ్రామాలకు సంబంధించిన వార్డు మెంబర్లకు సంబంధించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయినది. ఈ కార్యక్రమంలో మండలంలోని 9 గ్రామాలకు సంబంధించిన ఉపసర్పంచులు మరియు వార్డు మెంబెర్స్ మొత్తం కలిపి 92 మంది శిక్షణా కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 గురించి మరియు దాదాపు మొత్తం 18 రకాల ముఖ్యమైన అంశాల గురించి సవివరంగా తెలుసుకోవడం జరిగింది. తేదీ 27.02.2026 రోజు ముగిసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంపిడిఓ విజయ్ కుమార్ హాజరై శిక్షణలో పాల్గొన్న వార్డు మెంబర్లను, వారికి శిక్షణ ఇచ్చిన అయిదుగురు వివిధ మండలాల పంచాయితీ కార్యదర్శులను మరియు ఈ అయిదు రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించిన స్థానిక ఎంపివో ఖాజా మొయినుద్దీన్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమంత్ , ఉపసర్పంచ్ చింతపూల అనిల్ కుమార్ తో పాటు వార్డు మెంబెర్స్ తోట లావణ్య, గట్టు లక్ష్మీ,అందే పూజ,అందే స్వరూప, బింగి విజయ, తోట లక్ష్మణ్, ఎం ఉమ్మర్, నడిగొట్టు కిరణ్,అందె బాబు,అందె తిరుపతి, కముటం అనిల్ పాల్గొని ఎంపీడీవో చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందుకోవడం జరిగింది.

# సైన్స్ క్వెస్ట్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపు





**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు) :** మండలంలోని పీఎంఎస్ హెచ్‌ఆర్‌ఐ జడ్పీహెచ్ఎస్ గట్ల నర్సింగాపూర్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్స్ స్కాలర్షిప్ పరీక్షలో ప్రతిభ కనబరిచి విశేష ఫలితాలు సాధించారు. ఈ పరీక్షలో రిషిత, నాగేశ్వరి, ప్రణవి, యోగేష్, విన్సీ, అనుదీప్ లు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. ఇదిలా ఉండగా, జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలలో ఐఏయువైఎస్ఏ ఆధ్వర్యంలో "సైన్స్ క్వెస్ట్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, టీమ్ స్పిరిట్, సృజనాత్మకత పెంపొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేశారు.

# యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించాలి

## రిటైర్డ్ అడిషనల్ డీజీపీ కే.బాబురావు

## రన్నర్స్ అసోసియేషన్ ఆవిర్భావం



**సికింద్రాబాద్,ఫిబ్రవరి 28 ( ప్రజామంటలు ):** యువతను క్రీడారంగంలో ప్రోత్సహించి సరైన దారిలో నడిపించాలని రిటైర్డ్ అడిషనల్ డీజీపీ కే. బాబురావు అన్నారు. ముషీరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లోగోను ఆవిష్కరించారు .యువతలో డ్రగ్స్, మద్యం, టొబాకో వంటి అలవాట్లు పెరుగుతున్న నేపథ్యంలో క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం. అభిషేక్ మాట్లాడుతూ... యువతలో క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసు, ఆర్మీ రంగాలలో అవకాశాల కోసం శిక్షణ అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి కే. యశ్వంత్ కుమార్, కోశాధికారి వంశీకృష్ణ, సలహాదారులు డాక్టర్ ఎం. అశోక్, డాక్టర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర భారతి కాన్వెంట్ స్కూల్లో సైన్స్ డే వేడుకలు



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలంలోని వర్ష కొండ గ్రామంలో అక్షర భారతి కాన్వెంట్ స్కూల్ లో శనివారం రోజున జాతీయ సైన్స్ డే సందర్భంగా పిల్లలు అనేక రకాల సైన్సు ప్రాజెక్టులు తయారుచేసి వాటి యొక్క ప్రాముఖ్యతను పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దగ్గుల అశోక్. ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

# సాక్షి స్టడీ మెటీరియల్‌ను స్టూడెంట్స్ సద్వినియోగం చేసుకోవాలి



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు) :** విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచే దిశగా అందిస్తున్న "సాక్షి" స్టడీ మెటీరియల్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని జడ్.పి.హెచ్.ఎస్ మల్లారం ప్రధానోపాధ్యాయులు లావణ్య సూచించారు. పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. ప్రత్యేకంగా 10 వ, తరగతి విద్యార్థులు లక్ష్యంతో చదివి మెరుగైన ర్యాంకులు సాధించాలంటే ఈ మెటీరియల్‌ను క్రమం తప్పకుండా అభ్యసించాలని సూచించారు. "సాక్షి" స్టడీ మెటీరియల్‌ను పూర్తిగా వినియోగించుకుంటే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందని అధ్యాపకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాక్షి రిపోర్టర్ కాశిరెడ్డి, అధ్యాపకులు శశికళ, మహేందర్, కిషన్, కమలాకర్ పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో

## పాల్గొన్న ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల రూరల్ ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు)** :మండలం తక్కలపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ పట్నాలు మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు గ్రామ నాయకులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కి ఘన స్వాగతం పలికి,శాలువా తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మండల నాయకులు గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కిషన్ రావు పేట ప్రభుత్వ పాఠశాలలో

## ఘనంగా సైన్స్ డే వేడుకలు



**వెల్గటూర్ ఫిబ్రవరి 28 ( ప్రజా మంటలు) :** మండలంలోని కిషన్రావుపేట ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సర్ సివి రామన్ పుట్టినరోజు సందర్భంగా రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 రోజున జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటారని రామన్ ఎఫెక్ట్ను ఆసరా చేసుకొని పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ కు సంబంధించిన ప్రయోగాత్మకమైన తయారు చేశారని దీని ద్వారా విద్యార్థుల్లో అనేక విషయా లు సృజనాత్మకంగా వెలికి తీశారని విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకొని మూఢనమ్మకాలను పారద్రోలడానికి అవకాశం ఉంటుందని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి అవకాశం ఉందనిపాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి మునీంద్ర సిహెచ్ వనిత భవాని శిరీష జై సింగ్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సత్యవతి, మహిళా సంఘం చైర్మన్ అరుణ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవ కరపత్రం ఆవిష్కరణ



**జగిత్యాల ఫిబ్రవరి 28 ( ప్రజా మంటలు)** :విద్యానగర్ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాల కరపత్రాన్ని శనివారం దేవాలయం ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 26 నుండి 28 వరకు శ్రీరాముని ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఇనగంటి అశోక్ రావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 26 గురువారం విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యవచనం, రక్షాబంధన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 27 శుక్రవారం చైత్ర శుద్ధ నవమి రోజున మధ్యాహ్నం పునర్వసు నక్షత్రంలో శ్రీ సీతారామ కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. మరునాడు శ్రీ స్వామివారి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు డాక్టర్ గడ్డం వేణుగోపాల్ రెడ్డి, చుక్క మహేందర్, రుద్రంగి గోపాల కృష్ణ శర్మ, బట్టాజి గోపాల శర్మ, ఆలయ ఈవో సంగెం సురేందర్, ప్రధాన అర్చకులు రంజిత్ కుమార్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో వరల్డ్ సైన్స్ డే వేడుకలు



**సికింద్రాబాద్,ఫిబ్రవరి 28 ( ప్రజామంటలు):** ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని భోలక్ పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ను నిర్వహించారు. ఎగ్జిబిషన్ ను హెడ్మాస్టర్ డా.మంచాల వరలక్ష్మీ ప్రారంభించారు. ఇందులో వంద ప్రాజెక్ట్ లను ప్రదర్శించిన చిన్నారి విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు.దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొని, సైన్స్ ఎగ్జిబిషన్ ను విజయవంతం చేశారు. ప్రాజెక్ట్ లకు సంబందించిన వివరాలను చిన్నారి విద్యార్థులు పేరేంట్స్ కు, ఆహ్వానితులకు చక్కగా వివరించారు. ఇందులో పర్యావరణ రక్షణ,ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ) ,టెక్నాలజీ,సమతుల్య ఆహారం, కాలుష్య నివారణ,డ్రోన్ ఉపయోగాలు, పీఎస్ఎల్వీ నమునాలు,వాహనాల ట్రాఫిక్ నియంత్రణ...ఇలా అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, టీచర్లు, స్టూడెంట్స్,పేరేంట్స్, సందర్శకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందుతున్న జిల్లా ట్రెజరీ అధికారి ని

## సన్మానించిన టిఎన్జీఓ సంఘం




**జగిత్యాల ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు):** జిల్లా ట్రెజరీ అధికారి గా పనిచేస్తూ నేడు ఉద్యోగ విరమణ పొందుచున్న శ్రీమతి సి.హెచ్.సోఫియా ని టీఎన్జీవో జగిత్యాల జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడుతూ వారి భావి జీవితం సుఖ సంతోషాలతో గడపాలని శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ట్రెజరీ శాఖాధికారులు, టీజీవో జిల్లా అధ్యక్షులు కందుకూరి రవి బాబు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, టిఎన్జీఓ జిల్లా కోశాధికారి సాహెద్ బాబు, సంయుక్త కార్యదర్శులు రవి కుమార్, సుగుణాకర్, ప్రమోద్ కుమార్, శైలజ, శ్రావణి, విజయలక్ష్మి, గంగా జమున, చందు, శ్రీనివాస్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి

## కళ్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

## సమర్పించిన జిల్లా కలెక్టర్ దంపతులు



**ధర్మపురి ఫిబ్రవరి 28 (ప్రజా మంటలు)** :పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులుధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులను ఆశీర్వదించి శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూబ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలందరికీ ఆధ్యాత్మిక శాంతి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మరియు ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య ఆశీస్సులు జిల్లా ప్రజలందరికి కలగాలని ఆకాంక్షించారు బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్ గౌడ్, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, దేవస్థాన ఈవో, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరమల్లు రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 28 ప్రజా మంటలు** :ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి తో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోడిశాల రాజయ్య గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు శనిగరపు వెంకటేష్, గొర్రె ఆదం, సీనియర్ నాయకులు పాక రమేష్, యూత్ నాయకులు గొడిశాల అర్జున్ గౌడ్, సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ మండ సుమన్ గౌడ్, మండల స్థాయి నాయకులు యువజన నాయకులు మహిళ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా మంటలు

ఆదివారం 01 - 03 - 2026

# మావోయిస్టు రహితంగా తెలంగాణ

**గ్రేహౌండ్స్, ఎస్ఐబీ ఇక కనుమరుగు!**

**గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలను ఎత్తేయాలని కేంద్రం లేఖ!**

**మావోయిస్టులతో పాటు ప్రత్యేక విభాగాలు కూడా కనుమరుగు**

**అసలేంటీ గ్రేహౌండ్స్, ఎస్ఐబీ ఎవరు ఏర్పాటు చేశారు? వారి విధులేంటి?**



సుమారు 45 సంవత్సరాల పాటు హడలెత్తించిన వామపక్ష తీవ్రవాదం చివరి దశకు చేరడంతో పోలీస్ శాఖలో పలు వ్యవస్థాపరమైన మార్పులు చేర్పులు జరగనున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా మావోయిస్టులపై పోరాటంలో నిమగ్నమైన గ్రేహౌండ్స్ కమాండో దళం, ప్రత్యేక నిఘా విభాగాల పాత్ర పరిమితం కానున్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ విభాగాల్లో ఉన్న సిబ్బంది సంఖ్య, వెచ్చిస్తున్న ఖర్చును కుదించనున్నారు. మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ మారడంతో ఇవి క్రమంగా కనుమరుగు కానున్నాయి.రాష్ట్రంలో మావోలే లేరని చెబుతున్నప్పుడు వారికోసమే పెట్టిన వ్యవస్థల అవసరం ఏముంటుందని ఇటీవల జరిగిన ఓ హైలెవల్ మీటింగ్‌లో ప్రభుత్వం ప్రశ్నించినట్లుగా సమాచారం. మరో పక్క వామపక్ష తీవ్రవాదంపై పోరాడేందుకు ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విభాగాలను రద్దు చేయాలని కేంద్రం అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసినట్లుగా తెలుస్తోంది.

**గ్రే హౌండ్స్ విభాగ రూపశిల్పి వ్యాస్ :** బంగాల్‌లోని నక్సల్ బరిలో పుట్టిన నక్సలైట్ ఉద్యమం ఉమ్మడి ఏపీలోని శ్రీకాకుళంలో ప్రవేశించి అనంతరం మిగతా ప్రాంతాలకు ముఖ్యంగా తెలంగాణకు విస్తరించింది. అనతికాలంలోనే ఈ ఉద్యమం ప్రభుత్వానికే సవాలు విసిరే స్థాయికి చేరింది. గెరిల్లా దాడులతో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వీరిని అదే తరహాలో ఎదుర్కోవాలన్న ఉద్దేశంతో అప్పటి ఐపీఎస్ అధికారి వ్యాస్ గ్రేహౌండ్స్ విభాగానికి రూపకల్పన చేశారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చినటువంటి సహకారంతో దాదాపు 700 ఎకరాల్లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.మావోయిస్టులు అడవుల్లో ఉండి ఏ విధంగా దాడులు చేస్తారో అలానే ఎదురుదాడులు చేసేవిధంగా కమాండోలకు శిక్షణ ఇస్తారు. పోలీస్ శాఖలో కొత్తగా జాయిన్ అయిన వారిలో ఆసక్తి గల మెరికల్లాంటి వారికి కఠిన తర్ఫీదునిచ్చి కమెండోలుగా తీర్చిదిద్దుతారు. అడవుల్లోని ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటూ, ఆరు రోజుల పాటు మనగలిగేలా, రాత్రీపగలు అనే తేడాలేకుండా కనీసం 20 కిలీమీటర్లు నడవగలిగే విధంగా, ప్రత్యేక ఆయుధాలను ఉపయోగించే విధంగా ట్రైనింగ్ ఇస్తారు. గెరిల్లా యుద్ధతంత్రంలో గ్రేహౌండ్స్ విభాగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. అమెరికాతో పాటు పలు దేశాలకు చెందిన నిపుణులు గ్రేహౌండ్స్ పనితీరును పరిశీలించారు.

**ప్రాణాలనూ లెక్కచేయకుండా :** ప్రాణాలు కూడా లెక్కచేయకుండా ఎంతో రిస్క్ చేసి ఇక్కడ పనిచేయాల్సి ఉంటుంది. అందువల్ల గ్రేహౌండ్స్‌లోకి వచ్చేవారికి ప్రత్యేక అలవెన్సులు ఇస్తారు. సివిల్ పోలీసులతో పోల్చుకుంటే సీఐ స్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అరవై శాతం, డీఎస్పీ ఆపై స్థాయివారికి 50 శాతం అధికంగా జీతభత్యాలను చెల్లిస్తారు. విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం లాంటివి జరిగితే ఎంత ఖర్చయినా ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరిస్తుంది.మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు మరణించిన ఉద్యోగి డ్యూటీలోనే ఉన్నట్లుగా పరిగణించి, పదవీ విరమణ వయసు వచ్చే వరకు ఆ కుటుంబానికి నెలవారీ జీతభత్యాలను చెల్లిస్తుంది. అందుకే గ్రేహౌండ్స్ విభాగానికి ప్రతి ఏటా బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయిస్తారు. గత ఏడాది ఈ విభాగానికి రూ.34.91 కోట్లు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో 3000 మంది కమాండోలు ఉండేవారు. ఇప్పుడు తెలంగాణలో వీరి సంఖ్య సుమారు 1500.

**కనుమరుగవనున్న ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ :** ఈ విభాగంలో పనిచేసే సిబ్బంది సొంత సమాచార వ్యవస్థతో ఎప్పటికప్పుడు మావోయిస్టుల కదలికలను పసిగడతారు. వీటి ఆధారంగానే గ్రేహౌండ్స్ కమెండోలు మెరుపు వేగంతో దాడులకు దిగేవారు. గ్రేహౌండ్స్‌లో పనిచేసే వారికి ఇచ్చే రాయితీలన్నీ ఎస్ఐబీ వారికి కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎస్ఐబీలో సుమారు 100 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమం ఇంచుమించు చివరిదశకు చేరుకోవడం, ఇంకో 11 మంది మాత్రమే మిగిలారని డీజీపీ శివధర్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన సంగతి విధితమే.దీంతో మావోయిస్టులే లేనప్పుడు గ్రేహౌండ్స్, ఎస్ఐబీ విభాగాలు ఎందుకు అనే ప్రశ్న మొదలైంది. ఇదిలా ఉంటే వామపక్ష తీవ్రవాదంపై (మావోయిస్టులపై) పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధిత రాష్ట్రాలకు పెద్దఎత్తున నిధులిచ్చేది. ఇక మీదట ఈ నిధులను ఆపేస్తామని అనధికారికంగా చెప్పిన కేంద్రం, ప్రత్యేక విభాగాలను ఎత్తేయాలని లేఖ రాసినట్లుగా సమాచారం. దాంతో పోలీసు శాఖలో ప్రతిష్ఠాత్మకమైన గ్రేహౌండ్స్, ఎస్ఐబీలు మరికొద్ది రోజుల్లో కనుమరుగయ్యే అవకాశం ఉంది.

# గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంపై సిట్ దర్యాప్తు పూర్తి చేసే వరకు పర్యవేక్షిస్తాం

**హైకోర్టు గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాకనంలో అక్రమాలపై దర్యాప్తు చేస్తున్న సిట్**

**ఈ వ్యవహారంపై నివేదిక ఇచ్చేంత వరకు పర్యవేక్షిస్తామని స్పష్టం చేసిన హైకోర్టు, మార్చి 16న విచారణను వాయిదా.**




గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో అక్రమాల నిగ్గు తేల్చేందుకు తమ ఆదేశాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ పారదర్శక, చిత్తశుద్ధితో విచారణ చేస్తుందని తాము భావిస్తామని హైకోర్టు పేర్కొంది. సిట్ విచారణ పూర్తి చేసి కోర్టుకు నివేదిక ఇచ్చేంత వరకు ఈ వ్యవహారాన్ని తాము పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది.గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాల వ్యవహారంపై దాఖలైన అప్పీళ్ల విచారణకు న్యాయస్థానం ఇప్పటికే గణనీయమైన సమయం కేటాయించిన నేపథ్యంలో అప్పీళ్ల విచారణ కొలిక్కి వచ్చేంత వరకు తామే విచారణ కొనసాగిస్తామని(పార్ట్ హెర్డ్) హైకోర్టు స్పష్టం చేసింది. సిట్ నివేదిక దాఖలు చేసే నిమిత్తం విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

**హైకోర్టును సమయం కోరిన సీఎస్:** గ్రూప్-1 పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అప్రాధాన్యత పోస్టులకు బదిలీ చేసి, సంబంధిత వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు ఈనెల 25న జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ హైకోర్టును సమయం కోరారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణ జరిగింది. సీఎస్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి స్పందిస్తూ కోర్టు ఆదేశాలను అమలు చేసి వివరాలనుమెమో రూపంలో కోర్టు ముందు ఉంచామని తెలిపారు. తమ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారా? అని ధర్మాసనం అడిగిన ప్రశ్నకు ఎస్‌జీపీ బదులిస్తూ సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు.

**మార్చి 16కు విచారణ వాయిదా:** ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ సిట్ విచారణను తాము పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. గ్రూప్-1లో ఎంపికై ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారిని నాన్ ఫోకల్ పోస్టులకు తక్షణం బదిలీ చేయాలంటూ ఈనెల 11న ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు అమలు చేయని కారణంగా కోర్టుధిక్కరణ కింద వారిని శిక్షించాలంటూ గొర్ల సుజాత అనే అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. సీఎస్ విజయానంద్, ముఖ్య కార్యదర్శి శ్యామలరావుకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ వేయాలంటూ విచారణను మార్చి 16కు వాయిదా వేసింది.

**గతంలో:** ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకనంలో అక్రమాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదనపు డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో సిట్ బృందం ఏర్పాటు చేయాలని న్యాయస్థానం పేర్కొంది. దర్యాప్తు జరిపేటప్పుడు రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో వినియోగించిన బార్ కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లు, వాటి వివరాలు ఒకదానితో ఒకటి సరిపోలుతున్నాయో? లేదో అనే విషయాన్ని విశ్లేషించాలని స్పష్టం చేసింది.ద

# తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఇస్రో పిలుపు

**ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే?**

**విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అంతరిక్షంపై ఆసక్తి కల్గించేలా ఇస్రో కార్యక్రమాలు**

**తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తున్న ఇస్రో**

**దేశంలో ప్రముఖ ప్రాంతాల్లో నిర్వహణ**


'చందమామ రావే – జాబిల్లి రావే' అని అమ్మ తన పిల్లలకు చంద్రున్ని చూపిస్తూ అన్నం పెడుతుంది. ఈ నేపథ్యంలో చిన్నారులకు చంద్రుడన్నా, ఆకాశంలో మెరిసే నక్షత్రాలన్నా ఎంతో ఇష్టం ఏర్పడుతుంది. దీంతో అంతరిక్షానికి సంబంధించిన విషయాలను చెబితే పిల్లలు ఆసక్తికరంగా వింటారు. ఇలా చిన్నారులకు పాఠశాల దశ నుంచే అంతరిక్షంపై అవగాహన కల్పిస్తే, భవిష్యత్తులో వారు ఆ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వారికి విద్యార్థి దశలోనే అంతరిక్ష జ్ఞానం పెంపొందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువికా) నిర్వహిస్తోంది.దీనిలో భాగంగా ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఇస్రో తన ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లను అధిగమించింది. ఈ నేపథ్యంలో ఇటీవల వందకు పైగా ప్రయోగాలను పూర్తి చేసుకుంది. దీంతో అగ్ర దేశాలకు దీటుగా పరిశోధనలు చేపడుతోంది. విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానాన్ని పంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**శిక్షణ ఎక్కడంటే? :** తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం, గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్, మేఘాలయా రాష్ట్రంలోని షిల్లాంగ్, ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు ప్రాంతాల్లో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**దరఖాస్తు విధానం ఇలా :** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేయవచ్చు. దీనికోసం అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలి.

అధికారిక వెబ్‌సైట్ : https://jigyasa.iirs.gov.in/yuvika

**ఎంపిక విధానం :** పై లింక్ అధారంగా రిజిస్టర్ చేసుకున్న తర్వాత మరో లింక్ వస్తుంది. ముందుగా దీనిలో నిర్వహించే క్విజ్ పోటీలో పాల్గొనాలి. దీనిలో వచ్చిన మార్కుల ఆధారంగా 10 శాతం వెయిటేజీ ఇస్తారు. ఈ క్విజ్ పూర్తయిన తర్వాత విద్యార్థులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో పాటు చదువుకు సంబంధించిన వివరాలనూ నమోదు చేయాల్సి ఉంటుంది. దీనిలో పాల్గొన్న విద్యార్థుల 8వ తరగతి మార్కులకు 50 శాతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో చేరి ఉంటే మరో 5 శాతం, సైన్స్‌ఫెయిర్‌లో గతంలో పాల్గొని ఉంటే 10 శాతం, దీనితో పాటు గ్రామీణ విద్యార్థులకు 15 శాతం వెయిటేజీ మార్కులు ఇచ్చి చివరగా ఎంపిక చేస్తారు.



**ఏప్రిల్ 13న తొలి జాబితా :** మనం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించి ఏప్రిల్ 13న ఎంపికైన విద్యార్థుల తొలి జాబితాను ప్రకటిస్తారు. తర్వాత రెండో జాబితాను ఏప్రిల్ 20న విడుదల చేస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకునేందుకు చివరి గడువు తేదీ మార్చి 31. దీనిలో ఎంపికైన విద్యార్థులు మే 11 నుంచి 22 వరకు దేశవ్యాప్తంగా జరిగే కేటాయించిన ప్రాంతాల్లో యువికాలో పాల్గొంటారు. విద్యార్థుల భోజన, వసతి, రవాణాలకు అయ్యే పూర్తి ఖర్చును ఇస్రో భరిస్తుంది. ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలల్లో 2026 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి అర్హులు.

**ఇస్రో జైత్రయాత్ర :** అంతరిక్ష సాంకేతికను సామాన్యుడి చెంతకు చేర్చేలా ఇస్రో అడుగులు వేస్తోంది. తక్కువ ఖర్చుతోనే అత్యంత కచ్చితత్వంతో వందలాది స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెడుతోంది. దీంతో ప్రపంచ అంతరిక్ష వాణిజ్య రంగంలో ఇస్రో అగ్రగామిగా నిలిచింది. ఇప్పటికే ఇస్రో అనేక శాటిలైట్ కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ అంచనాలకు అవసరమైన అనేక ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. అవి విజయవంతమై, వాటి పనులు నిర్వర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇస్రో చంద్రయాన్-1 ప్రయోగం ద్వారా చంద్రునిపై నీటి జాడను గుర్తించింది. మొదటి ప్రయత్నంలోనే అంగారకుడి కక్ష్యలోకి ప్రవేశించి విజయపతాకం ఎగురవేసింది. అంతరిక్షంలో డాకింగ్ టెక్నాలజీని ఇటీవల సొంతం చేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే విజయాలు అనేకం.


# రంజాన్ వేళ ప్రత్యేకంగా 'రాత్ బజార్' షాపింగ్

**కళకళలాడుతున్న చార్మినార్ పరిసర మార్కెట్లు**

**రంజాన్ ప్రార్థనలు, స్ట్రీట్ ఫుడ్, రాత్ బజార్ షాషింగ్**

**నగరంలో నైట్ బజార్‌కు భారీగా తరలివస్తున్న ప్రజలు**

**రంజాన్ వేళ మక్కామసీదులో ప్రత్యేక ఏర్పాట్లు**



రంజాన్ మాసం పేరు వినగానే ముందుగా మనందరికీ గుర్తుకొచ్చేది హైదరాబాద్‌లోని పాతబస్తీ చార్మినార్, శాలిబండ, పురానాపూల్. వాటితో పాటు మక్కా మసీదు. రంజాన్ మాసం కొనుగోళ్లతో చార్మినర్ చుట్టున్న పరిసర మార్కెట్లలో ఉండే ఆ సందడే వేరు. ఈద్-ఉల్-ఫితర్ కోసం కావాల్సిన వస్తువుల కొనుగోలుకు ముస్లింలు తరలివస్తున్నారు. ఈ రంజాన్ మాసంలో రాత్రంతా వ్యాపారాలు కొనసాగించడానికి ప్రభుత్వం అనుమతించటంతో నైట్ బజార్ నెల రోజుల పాటు ఇలాగే కొనసాగునుంది.ఈ పండగకు కొత్త దుస్తులు ధరించే సంప్రదాయం ఉంది. వీటితో పాటు పాదరక్షలు, కాస్మొటిక్ వస్తువులు ఖరీదు చేస్తారు. పండగ రోజున షీర్ కుర్మా తయారీకి వినియోగించే డ్రై ఫ్రూట్స్, పాయసానికి ఉపయోగించే పాత్రలు కొనుగోలు చేస్తారు. ఆ తర్వాత రాత్రి పూట రంజాన్ మాసం సందడి చూసి తమకు అవసరం ఉన్న వస్తువులను కొనుగోలు చేయడానికి నగరంలోని అన్ని వర్గాల ప్రజలు నైట్ బజార్‌కు తరలి వస్తున్నారు.మక్కా మసీదులో ప్రత్యేక ఏర్పాట్లు : ముస్లింలు ఇఫ్తార్‌తో రోజా దీక్ష విడిచిన అనంతరం నుంచి ఇషా, తరావీ ప్రార్థనల్లో పాల్గొనడానికి పలువురు మక్కా మసీదుకు వస్తారు. మసీదు సూపరింటెండెంట్ సయ్యద్ ఉమర్ పాషా, మేనేజర్ హాఫీజ్ వాహజ్ అహ్మద్ ఆధ్వర్యంలో నిత్యం ఇఫ్తార్ వేళలో సుమారు 50 కిలోలకు పైగా ఖర్జూర ఫలాలను పంపిణీ చేస్తున్నారు. ఆ రోజు సాయంత్రం ఉపవాసదీక్ష విడిచిన అనంతరం వివిధ హోటళ్లు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో రంజాన్ ప్రత్యేక వంటకాల విక్రయాలు క్రమంగా జోరుగా సాగుతున్నాయి.

**జోరుగా పండ్ల విక్రయాలు :** ముస్లింలు రోజాను విడవటానికి ఇఫ్తార్ సమయంలో ఎక్కువగా ఖర్జూర ఫలాలను స్వీకరిస్తారు. బొప్పాయి, అరటి, ద్రాక్ష, యాపిల్, కర్బుజా వంటి పండ్లను కూడా తీసుకుంటారు. దీంతో అన్ని రకాల ఫలాల విక్రయాలు బాగా సాగుతున్నాయి. ఇఫ్తార్ అనంతరం పలువురు హలీంతో పాటు హోటళ్లు, ఆరుబయట ప్రత్యేకంగా విక్రయించే కబాబ్‌లు వంటి వాటిని ఆరగిస్తున్నారు.

**రంజాన్ వేళలో అర్ధరాత్రి వరకు కొనుగోళ్లు :** చార్మినార్ వద్ద నైట్ బజార్ సందర్శకులను కనువిందు చేస్తుంది. హైదరాబాద్ పాతబస్తీలో ఏడాది మొత్తంలో జరిగే షాపింగ్ ఒక ఎత్తు అయితే, ఈ రంజాన్ నెలలో జరిగే షాపింగ్ మరో ఎత్తు అనే చెప్పవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి జనం ఇక్కడికి వచ్చి షాపింగ్ చేస్తుంటారు. ఇలా ఈ రంజాన్ నెలంతా పాతబస్తీ ప్రాంతమంతా కిటకిటలాడుతుంది. ఈ పండగ వేళలో షాపింగ్ అర్ధరాత్రి వరకూ కొనసాగుతుంది. ఈ నైట్ బజారులో అలంకార వస్తువులతో సహా అన్ని వెరైటీలు లభిస్తాయి. ప్రతి సంవత్సరం కొనుగోలు కోసం సరికొత్త సరకును ప్రవేశపెడతారు. దీంతో మిరుమిట్లు గొలిపే వెలుతురులతో వేసవిలో రాత్రి వేళలో వచ్చే ఆ చల్లగాలుల మధ్య చారిత్రక ప్రదేశమైన చార్మినర్ వద్ద రాత్రిపూట షాపింగ్ చేస్తుంటే వచ్చే మజాయే వేరు.

**షాపింగ్ కోసం రాష్ట్రాలు, విదేశాల నుంచి :** దేశవ్యాప్తంగా హైదరాబాద్ పాతబస్తీ ఎంతో పేరు గాంచిన ప్రాంతంగా పిలుస్తారు. అక్కడ గాజుల తయారీ, అమ్మకాల్లో వివిధ ప్రాంతాల్లో రంజాన్ పండుగను పురస్కరించుకుని షాపు యజమానులు కొత్త కొత్త డిజైన్లను ప్రవేశపెడుతున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా కొనుగోలుదారులు నగరానికి వస్తున్నారు. రంజాన్ ఉపవాస నెలలో సంప్రదాయబద్ధంగా ఉపయోగించే సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, ప్రత్యేక దుస్తులు, కుర్తా పైజామా వంటి వాటికి గిరాకీలు జోరుగా సాగుతున్నాయి.

**నోరూరిస్తున్న రంజాన్ స్పెషల్స్ :** నగరంలో చార్మినర్ పాతబస్తీలో దొరికే తినుబండారాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రాంతమంతా వంటల సువాసనలతో వ్యాప్తి చెందుతుంది. మరీ ముఖ్యంగా మరగ్, పాయా, పత్తర్ కా ఘోష్, అచార్ కా ఘోష్, హలీం, షిక్ కబాబ్, చికెన్ మెజెస్టిక్, చికెన్ 65 వంటి నాన్-వెజ్ ఐటమ్స్‌తో వంటకాలు ఈ ప్రాంతం నుంచి మనల్ని కదలకుండా చేస్తాయి. వీటితో పాటు వివిధ రకాల మిఠాయిలతో ఆహార ప్రియులను అలరిస్తున్నాయి.

# వాహనం ఆపక్కర్లేకుండానే వెళ్లిపోవచ్చు

**త్వరలో బారియర్‌లెస్ టోల్‌ప్లాజాలు**

**వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే దూసుకెళ్లిపోయేందుకు**

**మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో విధానం**

**యూపీఐ చెల్లింపు కాకుండా, నగదు చెల్లించేందుకూ ఏర్పాటు**

**విజయవాడ బైపాస్, కాజ ప్లాజాల్లో ఏర్పాటు**

హైవేపై రయ్‌రయ్ మంటూ వాహనాలు ఎంత వేగంగా వెళ్లినా, టోల్ ప్లాజా వద్ద మాత్రం కొన్ని సెకన్లు ఆగాక తప్పదు. ఫాస్టాగ్ ఉన్నప్పటికీ, అది రీడ్ అయ్యాక, ఆ టోల్ బూత్ ముందు ఉండే గ్రీన్ లైట్ వెలిగి, అక్కడి బారియర్ పైకి లేస్తేనే వాహనం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.ఇక వీకెండ్, పండగ సెలవులు అప్పుడు వాహనదారులు టోల్ ప్లాజా దాటడానికి మరింత ఎక్కువ సమయం నిరీక్షించక తప్పడం లేదు. అయితే వాహనం ఇకపై ఆపాల్సిన అవసరం లేకుండానే దూసుకెళ్లి పోయేందుకు మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో విధానాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (చీనాూ×) త్వరలో అమలు చేయనుంది. ఈ నూతన విధానాన్ని కోల్‌కతా-చెన్నై హైవేలో విజయవాడ-గుంటూరు మధ్య ఉన్న కాజ టోల్ ప్లాజాతో పాటు విజయవాడ బైపాస్‌లో వెంకటపాలెం వద్ద ఉండే టోల్ ప్లాజాల్లో అమలు చేయనున్నారు.

**బూత్‌లెస్ ప్లాజా ఏర్పాటు:** కాజ టోల్‌ప్లాజాలో ప్రస్తుతం ప్రతి లైన్‌కు బూత్, బారియర్ ఉన్నాయి. ముమ్ముందు వీటిని తొలగించనున్నారు. విజయవాడ బైపాస్ మార్చి ఆఖరుకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిక టోల్ ఫీజు వసూలు చేయనున్నారు. ఇందులో వెంకటపాలెం సమీపంలో బూత్‌లెస్ ప్లాజా ఏర్పాటు చేశారు. కేవలం బారియర్స్ మాత్రమే ఉన్నాయి. ముమ్ముందు అదీ తొలగించనున్నారు.

**ఎఫ్ఐడీ ఫాస్టాగ్ రీడర్, అధునాతన కెమెరాలు:** ఈ కొత్త విధానం అమలు చేసే ప్లాజాలో ఇకపై టోల్ బూత్స్, బారియర్స్ ఉండవు. టోల్‌ప్లాజాలో పైన శాటిలైట్ ఆధారిత జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ ఫాస్టాగ్ రీడర్, ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిజేషన్ (ూచీూ=) కెమెరాలు అమరుస్తారు.వాహనం ప్లాజా లోపలికి వస్తుండగానే కొంత దూరం నుంచే దాని నంబరు ప్లేట్‌ను ఏఎన్‌పీఆర్ కెమెరా గుర్తు పట్టేస్తుంది. ఆర్ఎఫ్ఐడీ ఫాస్టాగ్ రీడర్ ఆ వాహన ఫాస్టాగ్‌ను రీడ్ చేసి, టోల్‌ఫీజును వసూలు చేస్తుంది. ఇదంతా వాహనం టోల్‌ప్లాజా లోపలికి వచ్చే లోపే అయిపోతుంది. దీంతో వాహనం ఆగాల్సిన అవసరం ఉండదు.




**టోల్‌ఫీజులో మరో 25 శాతం అదనంగా:** ఫాస్టాగ్ లేని వాహనాలు చివరి లైన్ వరకు వెళ్లి, అక్కడ ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లేదా యూపీఐ చెల్లింపు చేసి వెళ్లవచ్చు. దీని వల్ల టోల్ ఫీజులో అదనంగా మరో 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అలాగే యూపీఐ చెల్లింపు లేకుండా నగదు చెల్లించే సౌకర్యం కూడాఉంటుంది. కానీ టోల్‌ఫీజుకు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది.

**మీరూ పెట్టుబడి పెట్టొచ్చు:** విజయవాడ నుంచి చిలకలూరిపేట వరకు 69.4 కిలో మీటర్ల మేర వరకు ఉన్న కోల్‌కతా-చెన్నై హైవేలో ప్రజలు పెట్టుబడి పెట్టేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అవకాశం కల్పిస్తోంది. పబ్లిక్ ఇన్విట్ పేరిట పెట్టుబడులు స్వీకరించనుంది. ప్రస్తుతం వివిధ హైవేల్లో టోల్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (టూ) విధానం అమలలో ఉంది. ఓ టోల్ ప్లాజా పరిధిలో 15 సంవత్సరాలకు ఎన్ని వాహనాలు వెళ్తాయో అంచనా వేస్తారు. తద్వారా ఆ మొత్తాన్ని ముందే చెల్లించే సంస్థలకు మాత్రమే ఆ సెక్షన్లు అప్పగిస్తారు.రాష్ట్రంలో రాజమహేంద్రవరం-అనకాపల్లి మధ్య కొన్ని టోల్‌ప్లాజాల్లో టీవోటీ విధానం ఉంది. ఇలాంటి వాటిలో ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం కల్పించాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయం తీసుకుంది. అందులోని పబ్లిక్ ఇన్విట్ విభాగం, ఓ హైవే సెక్షన్‌లో 15 సంవత్సరాల్లో టోల్ ద్వారా వచ్చే మొత్తాన్ని అంచనా వేస్తారు. దానిని ప్రజల నుంచి పెట్టుబడులుగా స్వీకరించి ఎన్‌హెచ్ఏఐకి ఇస్తుంది.పబ్లిక్ ఇన్విట్ విభాగమే అక్కడి టోల్ నిర్వహిస్తుంది. టోల్ వసూళ్లలో పెట్టుబడి కంటే అదనంగా వచ్చే మొత్తాన్ని ప్రజలకు లాభాల రూపంలో చెల్లించనుంది. దీనికి దేశ వ్యాప్తంగా 5 సెక్షన్లకు ఎంపిక చేశారు. ఇందులో మన రాష్ట్రంలోని విజయవాడ-చిలకలూరిపేట సెక్షన్ ఉంది. ఇదే హైవేలో తమిళనాడు పరిధిలో తడ-చెన్నై సెక్షన్ 33 కిలో మీటర్ల మేర ఎంపిక చేయడం గమనార్హం. త్వరలో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com